క్లుప్తంగా

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. మంచిర్యాలలో శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. అడ్మిషన్, ట్యూషన్, రకరకాల ఫీజుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. విద్యాసంస్థలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఫీజులు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాసపెల్లిలో గడపగడపకూ కాంగ్రెస్



ప్రజలతో మాట్లాడుతున్న సురేఖ

దండేపల్లి: మండలంలోని రాసపెల్లిలో శనివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుంది కాబట్టి, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. మంచిర్యాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఆమె వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

చెన్నూర్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 30న ఉదయం 11గంటలకు 2023–24కు సంబంధించి మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24సంవత్సరానికి గాను డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు టీజీయూజీసెట్‌లో అర్హత సాధించిన వారు ప్రవేశం పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 1వ తేదీన బీఏ, బీఎస్సీ(ఫిజికల్ సైన్స్), 2వ తేదీన బీఎస్సీ(బీజెడ్‌సీ), బీఎస్సీ(ఎంపీసీ) విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. పదో తరగతి మెమో, ఇంటర్ హాల్‌టికెట్, ఇంటర్‌మెమో, కులం, ఆదాయం, బోనఫైడ్ సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, 5 పాస్‌ఫోటోలు, టీజీయూజీసెట్ 2023 హాల్‌టికెట్ మెమోలు, ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలలో రిపోర్టు చేయాలని కోరారు.

'జిల్లా అభివృద్ధిలో ఎమ్మెల్యేలు విఫలం'



మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లాను అభివృద్ధి చేయడంలో జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ 9ఏళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మే 30వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు మహాజన్ సంపర్క్ కార్యక్రమం చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మోదీ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాకు విద్యార్థుల ఉన్నత చదువులకు కావాల్సిన ప్రభుత్వ విద్యా సంస్థలను తీసుకురావడంలో ముగ్గురు ఎమ్మెల్యేలు విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అది సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, ముల్కల్ల మల్లారెడ్డి, పోనుగోటి రంగారావు, మల్లిఖార్జున్, పెద్దపల్లి పురుషోత్తం, ఆరుముల్ల పోశం, నంగునూరి వెంకటేశ్వర్ గౌడ్, రజనీష్ జైన్, మునిమంద రమేశ్, సుదర్శన్ పాల్గొన్నారు.



నృత్యార్చన

- కూచిపూడిలో ప్రతిభ
- వివిధ వేదికలపై ప్రదర్శన
- గృహిణి, లెక్చరర్, నృత్య శిక్షకురాలిగా రాణింపు

బెల్లంపల్లి: శాస్త్రీయ నృత్య శిక్షణ కొత్త పుంతలు తొక్కుతోంది. ఇప్పటివరకు నాట్య శిక్షణాలయంలో, దేవాలయాల సన్నిధిలో, ఇంటివద్ద గురువు దగ్గరుండి నృత్యాన్ని నేర్చుకోవడం చూశాం. కానీ దేశ, విదేశాల్లో, సుదూర ప్రాంతాల్లో ఉంటున్న చిన్నారులకు ఓ ఉన్నత విద్యావంతురాలైన శాస్త్రీయ నృత్య శిక్షకురాలు ఆన్‌లైన్‌లో జూమ్‌యాప్ ద్వారా, ఇంటి దగ్గర కూచిపూడిలో శిక్షణ ఇస్తుంది. బెల్లంపల్లికి చెందిన అల్లాడి అర్చన గృహిణిగా, లెక్చరర్‌గా, నృత్య శిక్షకురాలిగా బహుముఖ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శిస్తూ సాటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. బుడిబుడి నడకల చిన్నారులకు నాట్యాన్ని నేర్పిస్తున్న ఆమె ఎన్నో వేదికల ద్వారా స్వయంగా శాస్త్రీయ నృత్యప్రదర్శలు ఇచ్చి, పలు అవార్డులు గెలుచుకుంది. ప్రముఖులతో సన్మానాలు, ప్రశంసలు పొందుతూ ప్రత్యేకత చాటుకుంటోంది.



బిందెలపై నిలబడి కూచిపూడి నృత్య ప్రదర్శన

సండే స్పెషల్

అవార్డులు.. సన్మానాలు

చిన్నారులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న, ప్రత్యేకంగా నృత్య ప్రదర్శనలు చేస్తున్న అర్చనకు ఇప్పటి వరకు ఎన్నో రకాల అవార్డులు వరించాయి. ప్రత్యేకించి సన్మానాలు, సత్కారాలు అందుకుంది. ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందింది.

- 2020లో మయూరి ఆర్ట్స్ సంస్థ అర్చనకు విశ్వకళానంది అవార్డును అందజేసి ఘనంగా సన్మానం చేసింది.
- 2020జనవరి నెలలో హైదరాబాద్ తెలుగు లలిత కళాతోరణంలో జరిగిన భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో జరిగిన అంతా రామమయం నృత్య రూపకానికి అర్చనను శాలువా కప్పి మెమొంటో అందజేసి సత్కరించారు.
- 2021లో బెల్లంపల్లిలో జరిగిన శ్రీమద్భాగవత సప్తాహం కార్యక్రమంలో ఇచ్చిన నృత్యప్రదర్శనకు ముగ్ధులై ప్రముఖపండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్ సత్కారం చేశారు.
- 2021గోదావరిఖనిలో తారా ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన నృత్య ప్రదర్శన పోటీల్లో కూచిపూడి నృత్యానికి అవార్డు అందజేశారు.
- 2021లో హైదరాబాద్‌లో జరిగిన రెండో ప్రపంచ కూచిపూడి నృత్య మహోత్సవ వేడుకల్లో భాగంగా ముచ్చింతల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చిన్న జీయర్‌స్వామి చేతుల మీదుగా అర్చన అవార్డును అందుకున్నారు.



ఆన్‌లైన్‌లో చిన్నారులకు నృత్య శిక్షణ

2019 నుంచి ఆన్‌లైన్‌లో కూచిపూడి శిక్షణ..

కరోనా వైరస్ మానవులకు శుచి, శుభ్రత, వంటలు, ఆరోగ్యంపై అవగాహన కలిగించింది. నేర్చుకునేలా చేసింది. అదేమాదిరిగా ఆన్‌లైన్ ద్వారా కూచిపూడి నృత్యం నేర్పించేలా చేసింది. కరోనా ప్రభావంతో చిన్నారులు ఇంటికి రాలేని పరిస్థితులు ఏర్పడటంతో 2019లో వచ్చిన ఆలోచనతో 'ఆన్‌లైన్'లో కూచిపూడి నేర్పించేలా యత్నాలు చేసింది. ఆ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇవ్వడంతో ఆమెలో ఉత్సాహం రెట్టింపైంది. దేశ, విదేశాల్లో ఉంటున్న తెలుగువారి చిన్నారులకు కూచిపూడి నృత్యం నేర్పించడానికి అర్చనకు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. ఆ తీరుగా అమెరికా, ఢిల్లీ, హైదరాబాద్, నిర్మల్, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లోని 40మంది చిన్నారులకు ఆన్‌లైన్‌లో నేర్పిస్తోంది.

శాస్త్రీయ నృత్యాన్ని బతికించుకోవాలి

ప్రస్తుతం పిల్లల్లో శాస్త్రీయనృత్యంపై కనీస అవగాహన ఉండటం లేదు. ప్రతి ఒక్కరూ పాశ్చాత్య నృత్యానికి ఆకర్శితులవుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కొంతమంది చిన్నారులు కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నారు. ప్రాచీన శాస్త్రీయ నృత్య కళను భావితరాలకు వారసత్వ సంపదగా అందించడాకి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలి. శాస్త్రీయ నృత్యాన్ని బతికించుకోవాలి.

– అల్లాడి అర్చన, నృత్య శిక్షకురాలు, బెల్లంపల్లి

రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలకేంద్రంలో ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చిన జీలుగ విత్తనాలను శనివారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారన్నారు. విత్తనాలు కూడా సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, కోఆప్షన్ సభ్యులు మున్వర్‌అలీఖాన్, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, నాయకులు జనార్దన్, భరత్‌నాయక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బుల కొలుపు కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కళాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దుబ్బుల కొలుపు కళాకారులను ప్రభుత్వం గుర్తించి, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలని కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జునుగరి దుర్గయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కర్ణమామిడి గ్రామంలో తెలంగాణ దుబ్బుల కొలుపు సంఘం జిల్లా అధ్యక్షుడు జునుగరి నారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బుల కొలుపు కళాకారులకు తగిన గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నారని, డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని, సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్‌తో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, డివిజన్ అధ్యక్షుడు శంకర్, నాయకులు శేఖర్, హరీశ్, లడ్డురాజు, సదానందం, అంజనేయులు, లస్మయ్య, మహేశ్, సాయికుమార్, సంతోశ్, అంజన్న పాల్గొన్నారు.

కాంట్రాక్టు సిబ్బందికి రెగ్యులరైజ్డ్ పత్రాలు అందజేత

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న పలువురు సిబ్బందికి రెగ్యులరైజ్ ఉత్తర్వుల పత్రాలను పీహెచ్‌సీలో శనివారం అందజేశారు. ఫార్మాసిస్టు స్నేహ, ల్యాబ్ టెక్నిషియన్ హకీమ్, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ్, శ్రీనివాస్ రెగ్యులరైజ్ కాగా పీహెచ్‌సీ వైద్యుడు కుమారస్వామి వారికి క్రమబద్ధీకరణ పత్రాలను అందజేశారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి



మాట్లాడుతున్న జాన్ ఆనంద్

బెల్లంపల్లి: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) జాన్ ఆనంద్ అన్నారు. శాంతిఖని గనిపై కార్మికులు, జీఎంఎస్ కాంట్రాక్టు ఉద్యోగులకు శనివారం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు రక్షణ సూత్రాలను విధిగా పాటించాలన్నారు. ప్రమాదరహిత సింగరేణిగా పేరు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్.కే ఏజెంట్ విజయ్‌కుమార్, మందమర్రి ఏరియా రక్షణ అధికారి రవీందర్, బీఎంఎస్ కాంట్రాక్ట్ మేనేజర్ ముస్తాఫా, గని సంక్షేమాధికారి శ్రీనివాస్, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఎలకేశ్వరంలో స్టీల్ బ్యాంక్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

భీమారం: మండలంలోని ఎలకేశ్వరంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను రైతుబంధు మండల కో ఆర్డినేటర్ పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న స్టీల్ బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ స్టీల్ సామగ్రిని గ్రామపంచాయతీకి అందజేస్తే, వాటిని గ్రామంలో ఏదేని కార్యక్రమాలు జరపుకుంటే వారికి నామమాత్రం అద్దె తీసుకొని అందజేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ఇది దోహద పడుతుందన్నారు. ఇందులో సర్పంచ్ కొడిపె సమ్మయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

వీవోఏల వినూత్న నిరసన



వేప ఆకులు తింటూ నిరసన

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా శనివారం వీవోఏలు వేప ఆకులను తిని వినూత్నంగా నిరసన చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: వరిధాన్యం పండించిన రైతులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మండలంలోని ద్వారకా, కాసిపేట ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సందర్శించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేసి, ఆ తర్వాత మండల కేంద్రంలో చేపట్టిన వీఓఏల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, డీసీసీ సభ్యుడు మురళీధర్‌రావు, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు రొడ్డ శారద, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ



బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఓ ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణంలో శనివారం వ్యవసాయ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఫర్టిలైజర్‌షాపులో ఉన్న విత్తన ప్యాకెట్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏడీఏ ఎల్తూరి సురేఖ మాట్లాడుతూ.. రైతులకు కాలం చెల్లిన, నకిలీ విత్తనాలను, ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని, అమ్మిన ప్రతి సరుకుకు సంబంధించి రశీదులు ఇవ్వాలని, రైతులు సైతం అడిగి తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. తనిఖీల్లో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య, ఎస్సై పాల్గొన్నారు.

సమాచారం

అందుబాటులో పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు

చెన్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ అధికారి ఆఫీస్‌లో పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారిని కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు 30కిలోల సంచి సబ్సిడీతో రైతులకు రూ.843కు అందిస్తామని తెలిపారు. రైతులు పంట వేసే ముందు పచ్చిరొట్ట ఎరువు ఎరువులు సాగుచేయడం వల్ల భూమి సారవంతమవుతుందని పేర్కొన్నారు.

'రశీదు తీసుకోవాలి'

చెన్నూర్: రైతులు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన షాపు యాజమాని నుంచి తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని వ్యవసాయాధికారి కవిత అన్నారు. చెన్నూర్ పట్టణంతో పాటు మండలంలోని దుగ్నెపల్లి, పొగెపల్లి, ఓత్కులపల్లి, ముత్తరావుపల్లి గ్రామాల్లో శనివారం ఫర్టిలైజర్ షాపులను ఎస్సై సౌజన్యతో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, రశీదు బుక్కులు, స్టాక్ వివరాలు పరిశీలించారు.కార్యక్రమంలో ఏఈవోలు, సాగర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నోటీస్‌బోర్డుపై ఎంపికైన విద్యార్థుల జాబితా

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ఎంపికైన విద్యార్థుల జాబితా స్కూల్‌లోని నోటీస్‌బోర్డుపై అంటించినట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు దరకాస్తు ఫారం, హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, పీహెచ్‌సీ సర్టిఫికెట్, బోనోఫైడ్, ఒరిజినల్ టీసీతో పాటు పాస్ ఫొటోలు తీసుకొనిరావాలన్నారు. మే 29 నుంచి 30లోగా ఉదయం 10గంటల నుంచి ఒంటిగంట వరకు పాఠశాలలో సిబ్బందికి అందజేయాలని సూచించారు.

నేడు పటేల్ యూత్ ఆత్మీయ సమావేశం

శ్రీరాంపూర్: మున్నూరు కాపు పటేల్ యూత్ ఫోర్స్ ఆత్మీయ సమావేశం ఆదివారం జరుగనుందని యూత్ రాష్ట్ర కార్యదర్శి గుర్రపు సతీష్ పటేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గల నరేన్‌గార్డెన్‌లో ఉదయం 10గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు.

ఫోన్ అప్పగింత

లక్సెట్టిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరుకు చెందిన గొల్ల వెంకన్న ఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసి కనుగొని, శనివారం బాధితుడికి అందజేశారు.

రమాబాయి అంబేద్కర్ వర్ధంతి

లక్సెట్టిపేట: మండలంలోని రంగంపేటలో అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి

రామకృష్ణాపూర్: వచ్చే నెల 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రవి అన్నారు. బొక్కలగుట్టలోని రైతువేదికలో శనివారం మందమర్రిరూరల్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ చెన్నూర్ నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌల్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కమిటీలు రద్దు'

పాతమంచిర్యాల: ఆమ్‌ఆద్మీ పార్టీ మంచిర్యాల నియోజకవర్గం పరిధిలోని అన్ని కమిటీలను రద్దు చేశామని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నయీంపాషా, సీనియర్ నాయకులు నల్ల నాగేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన కమిటీలు త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్



మాట్లాడుతున్న ఏసీపీ నరేందర్

కోటపల్లి: నేరాలను నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు. మండలంలోని అన్నారం గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 70 బైక్‌లు, 12 ఆటోలు, 3 టాటాఏస్ వాహనాలు, 2 బొలేరో వాహనాలు సీజ్ చేశారు. ఈసందర్భంగా ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ పోలీసులు ఉన్నది ప్రజల రక్షణకేనని తెలిపారు. ప్రజలకు భద్రత భరోసా కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సైలు వెంకట్, సుబ్బారావు, సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ సరోజన, టీఎస్‌పీఎస్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నీల్వాయిలో రైతుల ధర్నా



వేమనపల్లి: రైతులంతా రోడ్డు ఎక్కి ధర్నాలు చేయండి.. అట్లైతేనే లారీలు వస్తయ్.. మేము ఏమి చేయలేం అంటూ.. ధాన్యం కేంద్రం నిర్వాహకులు అంటున్నారని రైతులు నీల్వాయిలో నిరసనకు దిగారు. రోడ్డుపై కూర్చొని గంటసేపు ధర్నా చేశారు. మండలంలో సుమారు 9పీఏసీఎస్, డీసీఎంఎస్‌లు ఉండగా కొన్ని సెంటర్లకు మాత్రమే ధాన్యం లారీలు వస్తున్నాయి. నీల్వాయిలోని పీఏసీఎస్ ధాన్యం కేంద్రానికి 25రోజులుగా లారీలు రావడం లేదు. వారంలో రెండు లారీలు మాత్రమే రాగా డ్రైవర్‌కు 'మామూళ్లు' ఇచ్చిన వారివి మాత్రమే లోడ్ చేసి తరలిస్తున్నారని పలువురు ఆరోపించారు. డ్రైవర్‌కు మామూళ్లు ఇస్తేనే లారీలు వస్తాయని, కాంటా చేస్తామని నిర్వాహకులు అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మొదలైతేనే నిర్వాహకులకు లాభమని తరుగు, కోతకు ఒప్పుకుంటారని అందుకే లారీలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్ ధర్నా వద్దకు వెళ్లి తహసీల్దార్ రాజ్‌కుమార్‌తో మాట్లాడి రైతులను సముదాయించడంతో రైతులు శాంతించారు.